క్లుప్తంగా

నేడు మరిడిమాంబ పండగ



మునగపాక: మండలంలోని రామారాయుడుపేటలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక ప్రదర్శించనున్నారు.

నరాలశెట్టిని పరామర్శించిన ధర్మశ్రీ, బొడ్డేడ



వైఎస్సార్‌సీపీ నేత సూర్యనారాయణను పరామర్శిస్తున్న పార్టీ నేతలు ధర్మశ్రీ, ప్రసాద్

మునగపాక: మండలంలోని ఒంపోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నరాలశెట్టి సూర్యనారాయణను బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా పరిశీలకులు ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్‌లు పరామర్శించారు. సూర్యనారాయణ మావ తోట సత్యారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో సూర్యనారాయణ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సత్యారావు కుమారుడు నాగార్జున, పార్టీ నేతలు తాతారావు,దొడ్డి చిన్న,కాండ్రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

జనవాణి ద్వారా సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: పజా సమస్యల పరిష్కారానికి జనవాణి దోహదపడుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండడం ద్వారా సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శేషుబాబు, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్,ఉపాధిహామీ పథకం ఏపీవో శివ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

నక్కపల్లి: క్రిస్టియన్, మైనార్టీలకు సబ్సిడీతోకూడిన రుణాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మండలానికి తొమ్మిది యూనిట్లు మంజూరయ్యాయన్నారు. రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు రుణ సదుపాయం ఉంటుందన్నారు.50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్టు తెలిపారు. పండ్లు, పాన్,కిరాణా,మటన్,చికెన్ దుకాణాలు, సైకిల్ షాపులు,కూరగాయాల వ్యాపారం అలాగే ఏసీ, ఫ్రిజ్ మరమ్మతుపనులు, ఆటో మొబైల్‌పనులు, బ్యాటరీ రిపేరు, ఫోన్ మరమ్మతు పనులు చేసుకోవచ్చన్నారు. నక్కపల్లిమండలంలో స్టేట్‌బ్యాంకు, గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, డీసీసీబీ,ఐవోబీల ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలు అందజేయనున్నారని, ఆసక్తికలిగిన వారు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న సిబ్బంది

ఎస్.రాయవరం: ప్రకృతి వ్యవసాయంతో కలుషితం లేని, నాణ్యమైన ఆహార ధాన్యాలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జి,కమల,కనకా రావు తెలిపారు. కోనవాని పాలెంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో ఎక్కువ ప్రాంతం వర్షాధారం అయినప్పటికీ సాధ్యమైనంత అధిక విస్తీర్ణంలో సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు పండించాలన్నారు. ప్రకృతి సేద్యంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం

- రక్షణ గోడులు లేని కల్వర్టులు
- పట్టించుకోని అధికారులు



కొండకర్ల జంక్షన్‌కు సమీపంలో రక్షణ గోడ లేని కల్వర్టు



ఉప్పవరం మార్గంలో శిథిలమైన కల్వర్టు

అచ్యుతాపురం: నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే మండలంలోని రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అచ్యుతాపురం–అనకాపల్లి రహదారిని విస్తరిస్తున్నారు. ప్రత్యామ్నాయ రహదారులు లేకపోవడంతో ఈ మార్గంలోనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో కొండకర్ల జంక్షన్‌కు సమీపంలో గల కల్వర్టుకు రక్షణ గోడలు లేవు. ఇరుకు మార్గం కావడం, ఆపై రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. కొండకర్ల జంక్షన్ నుంచి జగన్నాథపురానికి వెళ్లే వె రహదారులు కూడా ప్రమాదకరంగా మారాయి. ఎక్కువగా మలుపులు ఉండడంతో పాటు ఉప్పవరానికి ముందున్న కల్వర్టు శిథిలావస్థకు చేరింది. రోడ్డుకు ఇరు పక్కల బెర్మ్‌లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

> **మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం**
>
> అచ్యుతాపురం మండలంలోని కొన్ని రహదారుల విస్తరణకు ప్రతిపాదనలున్నాయి. మా అధీనంలో ఉన్న రహదారుల్లో ప్యాచ్ వర్క్‌లు,జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాం.శిథిలమైన కల్వర్టులు,రక్షణ గోడ లేని కల్వర్టులు ఉంటే పరిశీలించి, నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతాం.
>
> – భార్గవి, ఆర్అండ్‌బీ ఏఈ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: మండలంలోని పురుషోత్తపురం, మున్సిపాలిటీలోని పెదపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ(ఆపరేషన్స్) కె. రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదషేకిల్లపాలెం,చిన షేకిల్లపాలెం, గొల్లలపాలెం, పెదపల్లి, మంత్రిపాలెం, కొక్కిరాపల్లి, రాంనగర్, మర్రిబంద, ఎర్రవరం, అల్లూరి సీతారామరాజు కాలనీ, పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. చిన ఉప్పలం ఆక్వా సర్వీస్, కొరుప్రోలు క్వాయిర్ ఇండస్ట్రీ, గుడివాడ, గుర్రాజుపేట,ఎల్‌పీఆర్ పేట, పెదఉప్పలం ,రేవుపోలవరం, చినఉప్పలం, వా తాడ, బంగారమ్మపాలెం తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో బుధవారం సాయంత్రం ఆయన విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ, మట్టి పాత్రల పంపిణీ



మజ్జిగ, మట్టి పాత్రలు పంపిణీ చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

పాయకరావుపేట: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తుని, పాయకరావుపేటల్లో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. తుని మార్కెట్ రోడ్డు, పాయకరావుపేట మెయిన్ రోడ్డులో సుమారు ఏడువేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. పక్షులకు నీటిని అందించేందుకు 200 మట్టి పాత్రలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కె.కిషోర్ రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, అధ్యక్షుడు ఎం.వెంకట రాజా రెడ్డి, సహ అధ్యక్షుడు కె.నారాయణ రెడ్డి, ట్రెజరర్ టి.సోమనాథ్ రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, కె.రామారెడ్డి, సీహెచ్ మణికంఠ రెడ్డి, ఎస్.సురేష్‌రెడ్డి, కె.కిరణ్ రెడ్డి, కె.అజయ్ రెడ్డి, ఎస్.మణికంఠ రెడ్డి, ఎం.శివారెడ్డి, పి.భరత్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్.సంజీవరెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, టి.లచ్చారెడ్డి, సీహెచ్.శేషారెడ్డి, టి.ఎస్.ఎన్.రెడ్డి, సరస్వతీ సేవా సమితి అధ్యక్షుడు శివరామకృష్ణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధ వాతావరణం సమసిపోవాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

కశింకోట: దేశంలో శాంతి నెలకొనాలని, భారత్,పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సమసిపోవాలని కోరుతూ స్థానిక ఆంధ్ర కల్వరి సెంచురియస్ బాప్టిస్టు చర్చిలో జిల్లాలోని పాస్టర్లు, విశ్వాసులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారత్ సరిహద్దులో ఉన్న సైనికులు, దేశ నాయకులు, ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. దేశ రక్షణలో అమరులైన సైనికుల కుటుంబాలకు ఓదార్పు కలగాలని ప్రార్థించారు. జిల్లా క్రైస్తవ సమాజం రెవరెండ్ సన్నీ జేమ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రెవరెండ్ ఏసురత్నం, తిమోతి, పీటర్, సీహెచ్. ప్రకాష్, యోహాను, జాన్సన్, శాంసన్ రాజు, విశ్వాసులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారమివ్వండి



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ పైడి రాజు

అచ్యుతాపురం రూరల్ : తీరప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మెరైన్ ఎస్ఐ పైడిరాజు తెలిపారు. తంతడిపాలెంలో మత్స్యకారులతో బుధవారం ఆయన మాట్లాడారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం కారణంగా సముద్రం మార్గంలో గుర్తు తెలియని , అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే మెరైన్, పోలీసు సిబ్బందికి గాని, టోల్ ఫ్రీ నంబర్ 1093కి గాని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెరైన్ స్టేషన్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిల పనులు ప్రారంభం



కొళాయి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల గ్రామంలో ఇందిరానగర్‌లో జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికీ కుళాయిలు వేసే పనులను గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పి.డి. గాంధీ, వార్డు మెంబర్లు ముత్యాల వెంకటలక్ష్మి, ఖండేలా గోవిందమ్మ, తత్ర సత్యారావు పాల్గొన్నారు.

నత్తకన్నా నెమ్మదిగా...



మరమ్మతు పనులు ప్రారంభించిన అనంతరం పక్కన పెట్టిన రోడ్డు రోలర్



నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డుపై గోతుల్లో వేసిన పిక్క

ప్రారంభించి ఎనిమిది నెలలైనా ముందుకు సాగని రోడ్డు పనులు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు–నర్సీపట్నం రోడ్డు మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ రోడ్డును విస్తరించి, గోతులు పూడ్చేందుకు సుమారు రూ.24 కోట్లను కేటాయించగా, రాష్ట్ర హోంమంత్రి అనిత ఎనిమిది నెలల క్రితం శంకుస్థాపన చేశారు.అయితే కాంట్రాక్టరు నచ్చిన చోట పనులు మొదలు పెట్టి, అక్కడక్కడ రోడ్డును తవ్వి వదిలేశారు. అడ్డురోడ్డు నుంచి కోటఉరట్ల మండలం రామచంద్రాపురం వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులున్నాయి. వీటితోనే వాహనచోదకులు అవస్థలకు గురవుతుంటే.. నిర్మాణ పనుల కోసం పిక్క రాయి వేసి వదిలివేయడంతో మరింతగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా వాహనాలను నడిపినా ప్రమాదాలకు గురికాక తప్పదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా వాహనాలు స్కిడ్ అవడంతో పలువురు గాయపడ్డారు. అధికారులు స్పందించి త్వరితగిన రోడ్డు పనులు పూర్తి చేయించాలని వాహనచోదకులు కోరారు.

నేడు కామేశ్వరమ్మ పండగ



ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

మాకవరపాలెం : రాచపల్లి జంక్షన్‌లో వెలసిన కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఈ పండగను స్థానికులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పండగ రోజు రాత్రి రాచపల్లి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నర్సీపట్నంలో కుండపోత వర్షం



మెయిన్ రోడ్డుపై చేరిన వర్షం నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నర్సీపట్నం : నర్సీపట్నంలో మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. రెండు రోజులుగా కాసిన ఎండలకు ప్రజలు బెంబేలెత్తారు. ఉక్కపోతతో అల్లాడారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపానికి జనం విలవిలాడారు. ఒక్కసారిగా వాతావరణ చల్లబడి, ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో జనం ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు. కుండపోత వర్షానికి పట్టణంలో ప్రధాన డ్రైనేజీ పొంగి వర్షపు నీరు మెయిన్‌రోడ్డుపై ఏరులై పారింది. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద మెయిన్ కల్వర్టు కూరుకుపోవడంతో వర్షం నీరు మెయిన్‌రోడ్డుపై చేరి చెరువును తలపించింది. వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

17న సైనికులకు మద్దతుగా ర్యాలీ

యలమంచిలి రూరల్: ఉగ్రవాదం రూపుమాపడం, దేశ ప్రజల రక్షణే ధ్యేయంగా దేశ సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న త్రివిధ దళాల ఉద్యోగులకు మద్దతుగా ఈ నెల 17న యలమంచిలి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సైనికోద్యోగులను గుర్తిస్తున్నామని,వారందరికీ మద్దతుగా అన్ని వర్గాల ప్రజలతో ర్యాలీగా సైనికోద్యోగుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులను కలిసి వారికి తమ మద్దతు తెలియజేస్తామన్నారు.సైనికోద్యోగుల తల్లిదండ్రులను సత్కరించి వారి ఇళ్లపై జాతీయ జెండాను ఉంచనున్నట్టు ఆమె తెలిపారు.దేశ ప్రజల రక్షణ బాధ్యతకోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నవారి సేవలను గుర్తించడంతో పాటు వారి కుటుంబసభ్యులకు మద్దతునివ్వడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు.రాజకీయాలకు అతీతంగా చేపట్టనున్న ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములుగా చేస్తున్నట్టు చెప్పారు. సైనికోద్యోగుల సేవలు వెలకట్టలేన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జె.ఎస్. ప్రసాదరాజు,స్థానిక వ్యాపారి కట్టా సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

గణేష్ మృతి తీరని లోటు



గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: రైలు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కరోతి గణేష్ మృతి చెందడం బాధాకమరని, గణేష్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. ఉమ్మలాడకు చెందిన కరోతి గణేష్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందడంతో బుధవారం స్వగ్రామంలో సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ చిన్నవయస్సులో గణేష్ మృతి చెందడం బాధాకరమన్నారు. పార్టీ బలోపేతానికి గణేష్ ఎంతో కృషి చేసినట్టు చెప్పారు. గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ,పార్టీ జిల్లా ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు పిల్లి అప్పారావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మందా రాము, యువజన విభాగం మండల అధ్యక్షుడు బొడ్డేడ లిల్లి, ఎంపీటీసీలు మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు,మళ్ల కాశీసురేష్,బొడ్డేడ బుజ్జి, పార్టీ నాయకులు మొల్లేటి వినోద్,బొడ్డేడ బుజ్జితో పాటు గణేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గణేష్ సంతాప కార్యక్రమంలో భాగంగా అభిమానులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రమణమూర్తిరాజు ప్రారంభించారు.ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు దోహదపడతాయన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ

సందడిగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు



స్వామివారికి పూలంగి సేవ చేస్తున్న అర్చకులు

చోడవరం: స్థానిక ఆపదహార శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు కన్నులపండువగా బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రాత్రి కన్నులపండువగా పూలంగి సేవ చేశారు. పలు రంగుల పువ్వులతో స్వామివారి పూల పాన్పును తయారు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, పూలంగి సేవ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శాంతారామాచార్యులు, వాసు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య పూలంగి సేవ వైభవంగా జరిగింది. గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో పూలు, పండ్లు తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ వింజుమూరి శంకర్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

వీఆర్పీల ఆకలి కేకలు

మూడు నెలలుగా అందని జీతాలు



బుచ్చెయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్పీలు

బుచ్చెయ్యపేట : మండలంలో వీఆర్పీలకు మూడు నెలలుగా జీతాలు అందలేదు. కుటుంబాలతో అర్ధాకలితో అలమటిస్తున్నామని, తక్షణం ప్రభుత్వం జీతాలు అందించి ఆదుకోవాలని బుధవారం బుచ్చెయ్యపేటలో నిరసన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న 35 పంచాయతీ గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వీఆర్పీలు ప్రతి రోజు సుమారు 8 వేల మంది కూలీలకు పనులు కల్పిస్తున్నారు. కూలీలకు రోజువారీ పనులతో పాటు గ్రామాల్లో రోడ్లు, చెరువులు, కాలువలు, ఇంకుడు గుంతలు, ట్రెంచ్‌లు, పండ్ల తోటల పెంపకం ఇతర పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు పని చేస్తున్నా వీరికి మాత్రం నెలవారీ జీతాలు సకాలంలో అందించడం లేదని మండల వీఆర్పీల సంఘం అధ్యక్షుడు యన్నంశెట్టి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు కొల్లి కశింనాయుడు, కార్యదర్శి తాటికొండ శ్రీనివాసరావు, కోశాధికారి కురసా రమేష్ వాపోయారు. ఫిబ్రవరి,మార్చి,ఏప్రిల్ మూడు నెలలు జీతాలు అందించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

ఆరోగ్య ఉప కేంద్రం...నిరుపయోగం



ఎ.కోడూరులో నిరుపయోగంగా ఉన్న భవనం

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిరుపయోగంగా ఉంది. ఉప కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 23 ఏళ్ల క్రితం గ్రామం శివార్లలో భవనాన్ని నిర్మించారు. గ్రామానికి దూరంగా భవనం ఉండడంతో రోగులు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపలేదు. దీంతో గ్రామంలోనే వైద్య సిబ్బంది అద్దె భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణను ప్రస్తుతం సాగిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంలో గతంలో హోమియోపతి వైద్య సేవలు అందేవి. ఈ కేంద్రానికి సొంత భవనం లేక హోమియో వైద్యాన్ని కె.కోటపాడులో గల 50 పడకల ఆస్పత్రికి తరలించారు. శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి మరమ్మతులు నిర్వహించి హోమియో వైద్యాన్ని ఎ.కోడూరులోనే ఉండేలా వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్షలు

రావికమతం: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మత్సవానిపాలెం గ్రామంలో భక్తులు బుధవారం ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 20 మంది భక్తులకు గ్రామ పురోహితులు వేపా ధర్మఫణి ఆధ్వర్యంలో సర్పంచ్ మలిచెట్ల గణేష్, గురుస్వామి సోమిరెడ్డి శివ మాలధారణ చేయించారు. తొమ్మిది రోజుల పాటు కఠినమైన నియమాలు ఆచరించి దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.